నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 15 మే 2025 | ADILABAD NIRMAL



కన్నెపల్లి కొనుగోలు కేంద్రంలోకి చేరిన వరద నీరు

# వర్షార్పణం

● అకాల వర్షంతో తడిసిన ధాన్యం ● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
● ఆందోళన చెందుతున్న అన్నదాతలు ● తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్

### నిన్న కాంట పెడుతమన్నరు.. రాత్రి వర్షం కురిసింది..



మాది కన్నెపల్లి. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి ఐదారు రోజులు అవుతుంది. తేమ కూడా వచ్చింది. నిన్న రాత్రి తెల్లారుజామున కాంట పెడుతమన్నరు. కానీ.. రాత్రికి రాత్రి వర్షం వచ్చింది. ఇప్పుడేమో మళ్లీ ఆరబెట్టమన్నరు. ఇవీ ఆరాలంటే మళ్లీ రెండు, మూడు రోజులు అయితది. కొంచెమే తడిసినయ్. మళ్లీ వర్షం రాకముందే వడ్లు లేసేలా చూడండి సార్. మళ్లో సారి వర్షం వస్తే పడిన కష్టమంతా బూడిదలో పోసినట్లు అయితది. **- శనిగరపు బొర్రయ్య, రైతు కన్నెపల్లి**

### వడ్లు పోసి ఆరమైతంది.. చూసేటోళ్లు లేరు



ఖానాపూర్ రూరల్, మే 14 : ఉదయం కురిసిన వానకు రైతులంత వచ్చి కేంద్రాల్లో ఆగమైతే నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షం పడి వడ్లల్లో నీరు నిలిచింది. తడిసిన ధాన్యాన్ని పట్టించుకునే నాథుడేలేడు. సుర్జాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రం పరిస్థితి ఇలా ఉంది. వడ్లు పోసి ఆరమవుతుంది. వచ్చి చూసేటోళ్లు లేరు. వాన పడితే మళ్లీ ఆరబెట్టుమంటున్నారు. తేమ శాతం తగ్గిన మ్యాచర్ వచ్చిన తూకం చేయడం లేదు. కేంద్రంలో మొత్తం హమలీలు 8 మంది ఉన్నారు. వాళ్లకు అధిక భారమవుతుంది. పనులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రైతులు వర్షాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. పనులు వేగవంతం చేసియాలి. **- బుసి నరేందర్, రైతు, సుర్జాపూర్**

### మా బతుకులు ఘొరమైనయ్

ఖానాపూర్ రూరల్, మే 14 : ఒకవైపు ఆనలు పడుతున్నాయ్. కేంద్రమొళ్లు లేట్ చేస్తుండ్రు. వడ్లు తడిసి మా బతుకులు ఘొరమైతున్నాయి. ఎవరు పట్టించుకోవడం లేదు. నేను ఆరెకరాలు పొలం చేసి ఎల్లాపూర్ కొనుగోలు సెంటర్ల వడ్లు పోశా. 200 సంచుల వడ్లు అమ్మా. వడ్లను పోసి పది రోజులైంది. ఇంకా జోకేటివి ఉన్నాయి. కేంద్రపొళ్లు జోకుతలేరు. జోకిన వడ్లను కూడా పంపకపోవడంతో రాత్రి కురిసిన వానకు తడిసిపోయాయి. వడ్లు తడవడంతో మిల్లరొళ్లు కిలోల చొప్పున మా పైసలు కట్ చేస్తున్నరు. ఇన్ని రోజులు కష్టపడి ఇంటికి తెచ్చిన వడ్లను అమ్ముకోలేక రైతులం ఆగం చేస్తుంది ఈ ప్రభుత్వం. అధికారులు తూకం పనులను వేగం చేసి రైతులను ఆదుకోవాలి. **- ఇడగొట్టి లక్ష్మీ, మహిళా రైతు, పాత ఎల్లాపూర్**



మంచిర్యాల, మే 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించే సమయానికి అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసిన ధాన్యం బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి తడిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు చోట్ల వర్షపు నీరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముంచెత్తింది. పలుచోట్ల కుప్పలుగా పోసిన ధాన్యంతోపాటు తూకం వేసిన ధాన్యం తడిసింది. మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం తెల్లవారుజామును భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కొత్తపల్లి, మద్దికల్, ఆరెపల్లి, రెబ్బపల్లి, దాంపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కోటపల్లి మండలంలోని పారుపల్లి సహా చెన్నూర్ రూరల్ మండలంలోని ఆస్నాద్, కిష్టంపేట, కొమ్మెరలో భారీ వర్షానికి రాసులుగా పోసిన ధాన్యం కుప్పల్లోకి నీరు వచ్చి చేరింది. మందమర్రి రూరల్ మండలంలోని సారంగపల్లి, పొన్నారం, వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాల్లో స్వల్పంగా ధాన్యం తడిసింది. కన్నెపల్లి మండల కేంద్రంతోపాటు మాడవెల్లి, మెట్‌పల్లి కొనుగోలు కేంద్రాలు వర్షానికి బురదమయంగా మారాయి. దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసి.. ధాన్యపు రాశులపైకి వర్షపు నీరు చేరింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంతోపాటు మస్కాపూర్, సుజ్జాపూఉర్, సత్తన్నపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారీ వర్షం ముంచెత్తింది. దీంతో చాలా వరకు ధాన్యం తడిసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురియడంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, తూకం వేసి మిల్లులకు తరలించేందుకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యల వలయంలో రైతులు ధాన్యం విక్రయించుకోవాల్సిన దైన్యం నెలకొందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఆలస్యం చేయకుండా తడిసిన ధాన్యాన్ని కూడా తూకం వేసి మిల్లులకు తరలించాలని వేడుకుంటున్నారు.

దస్తురాబాద్ : మండల కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



### రైతుల వేదన

- ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయి.
- 20 రోజులైనా కొనడం లేదు. ఫలితంగా ధాన్యం తడుస్తున్నది.
- టార్పాలిన్‌లు ఇవ్వడం లేదు.
- హమాలీల కొరత తీవ్రంగా ఉంది.
- సమయానికి లారీలు లోడ్, అన్‌లోడ్ కావడం లేదు.
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

చెన్నూర్ మండలం ఆస్నాద్‌లో తడిసిన ధాన్యం



దండేపల్లిలో ధాన్యం కుప్పలపై నిలిచిన నీటిని తోడేస్తున్న రైతు



# వానకాలం ప్రణాళిక ఖరారు

● ఆదిలాబాద్ జిల్లాలో 5.85 లక్షల ఎకరాల్లో సాగు
● పత్తి 4.40 లక్షల ఎకరాలు.. స్వల్పంగా పెరగనున్న విస్తీర్ణం

ఆదిలాబాద్, మే 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా వానకాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు తయారు చేశారు. 5,85,350 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. గతేడాది వానకాలంలో 5,79,124 ఎకరాల్లో పంటలు సాగవగా.. ఈ ఏడాది విస్తీర్ణం స్వల్పంగా 6,226 ఎకరాల్లో పెరిగింది. ఎప్పటిలాగే పత్తి పంట అధికంగా 4.40 లక్షల ఎకరాల్లో సాగవుతున్నది. గతేడాది 4.36 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయగా.. ఈ ఏడాది 4 వేల ఎకరాల వరకు విస్తీర్ణం పెరగనుంది. సోయా 62,500, కంది 55వేలు, మక్క 2300, జొన్న 16 వేలు, వరి 1900, పెసర 550, మినుములు 550 ఎకరాలు, ఇతర పంటలు 250 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. గతేడాదితో పోల్చితే సోయా 2500, కంది 2500 తగ్గంది. మక్క 8 వేల ఎకరాల్లో పెరిగింది. ఇతర పంటలు దాదాపుగా గతేడాది మాదిరిగానే ఉన్నాయి.

**అందుబాటులో విత్తనాలు, ఎరువులు**

వానకాలానికి సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 13వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 36 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 7వేల మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 4వేల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ అవసరవుతాయని అధికారులు అంచ నా వేశారు. ప్రస్తుతం జిల్లాలో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 4వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 24 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1134 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 1071 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ అందుబాటులో ఉన్నాయన్నారు. 12 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు, 18725 సోయాబిన్, 21,960 కంది ప్యాకెట్లు అవసరమవుతాయని అధికారులు తెలిపారు.



### నకిలీ విత్తనాల నిరోధానికి చర్యలు



ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాల నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మండల, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసి దుకాణాలతోపాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు బిల్లుల రశీదులు తీసుకుని పంట చేతికి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలి. మహారాష్ట్ర రైతులకు కాకుండా జిల్లా రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేలా డీలర్లకు ఆదేశాలు జారీ చేశాం. **- శ్రీధర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి**

# ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయం

ఎదులాపురం, మే 14 : గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మావల మండల పరిధిలోని దుబ్బగూడలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను బుధవారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు రామన్న మాట్లాడుతూ.. సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని తెలియచెప్పేలా ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి కృపతో గ్రామస్తులంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాసం నర్సింగరావ్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సంజయ్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



# నైపుణ్యత, అభ్యసన సామర్థ్యం పెంచుకోవాలి

ఎదులాపురం, మే 14 : శిక్షణ ద్వారా నైపుణ్యత, అభ్యసన సామర్థ్యం పెంపొందించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని కళాశాల, బొక్కలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2లలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు పరిశీలించారు. బుధవారం పట్టణంలోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు, బోధన నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల పెంచుకోవడానికి ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఐదు రోజులపాటు సాగే శిక్షణలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ మండల రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ఏఎంవో శ్రీకాంత్, సుజిత్ ఖాన్, అజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

# కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన

● రెండు కిలోలు తక్కువ జోకుతున్నారని ఆరోపణ
● రైతుల ఆందోళనతో స్పందించిన అధికారులు

కుంటాల, మే, 14 : కుంటాల మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం పలువురు రైతులు ధాన్యాన్ని రెండు కిలోలు అధికంగా జోకుతున్నారని.. హమాలీలు, సిబ్బంది సమన్వయ లోపంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని ఆందోళన చేశారు. తూకం వేసిన వడ్లను తొందరగా తరలించడం లేదని, ఆకాశం మేఘావృతం కావడంతో ఎక్కడ వర్షం ఎప్పుడు పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కుంటాల పీఏసీఎస్ అధికారులు సరైన తేమ శాతంతో తూకం వేయడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై సీఈవో మురళిని ఫోన్‌లో సంప్రదించగా.. రైతులు నష్టపోకుండా నిబంధనల ప్రకారమే కొనుగోళ్లు జరుపుతామని, లారీల సమస్య లేకుండా చూస్తామని ఆయన తెలిపారు.



కుంటాల పీఏసీఎస్ వద్ద నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

# సర్కారు భూములను ఆక్రమిస్తే చర్యలు

**కలెక్టర్ అభిలాష అభినవ్**



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 14 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం తెలిపారు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సర్కారు భూములు ఆక్రమణకు గురువుతున్న విషయాలను గుర్తించామని, వాటిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికే పలు మండలాల్లో రెవెన్యూ శాఖ సర్వేలు చేపట్టి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణకు ప్రజలు సహకరించాలని, ఇకపై అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.